ప్రజా విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం


వెనక్కి నడిపే సనాతనం.. ముందుకు నడిపే మానవత్వం!

హిందూ రాజ్యం అనే రాజకీయ లక్ష్యం వెనుక ఎలాంటి సామాజిక వ్యవస్థ రాబోతున్నదో ప్రశ్నించాలి. మతాధికారం కంటే మానవ గౌరవం గొప్పదని చాటాలి.హిందూ రాజ్యం నిర్మించాలనే రాజకీయ ఆకాంక్షను కేవలం మతాభిమాన ప్రకటనగా చూసి వదిలేయలేం. ఆ రాజ్యంలో మనిషి స్థానం ఏమిటి? పౌరులందరికీ సమాన హక్కులు ఉంటాయా? పుట్టుకతో ఏర్పడిన కులమే మనిషి భవిష్యత్తును నిర్ణయిస్తుందా? స్త్రీ స్వేచ్ఛకు, ప్రశ్నించే హేతువుకు, శాస్త్రీయ ఆలోచనకు చోటుంటుందా? హిందూ రాజ్యాన్ని కోరేవారు ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.

ఎందుకంటే రాజ్యం స్వరూపం మారడమంటే పాలకుడి పేరు మారడం మాత్రమే కాదు; ప్రజల జీవితాలను శాసించే విలువలు మారడం కూడా.శివుడు గొప్పవాడా, విష్ణువు గొప్పవాడా అనే ఆధిక్యత వివాదం ఈ సందర్భంలో ఒక హెచ్చరికగా నిలుస్తుంది. హిందువులందరినీ ఒకే రాజకీయ గుర్తింపు కింద సమీకరించినా, అందులోని సంప్రదాయ భేదాలు అంతరించి పోవు. మతమే రాజ్యానికి పునాది అయితే ఏ సంప్రదాయానికిఅధికారిక ప్రాధాన్యం ఇస్తారు? ఎవరి ఆచారాన్ని అందరికీ ప్రమాణంగా నిర్ణయిస్తారు?ఏ వ్యాఖ్యానానికి రాజ్యాధికారాన్ని అప్పగిస్తారు? దేవుడి ఆధిక్యతపై మొదలయ్యే వాదం, ఆ దేవుడి పేరుతో మాట్లాడే వర్గాల అధికార పోటీగా మారే ప్రమాదాన్ని విస్మరించలేం.అందుకే ఈ వివాదాన్ని ఇద్దరు మతబోధకుల మధ్య మాటల తగాదాగా మాత్రమే చూడకూడదు. మతాధారిత రాజ్య నిర్మాణం ముందుకు సాగితే తలెత్తగల అంతర్గత ఆధిపత్య సంఘర్షణలకు సూచనగా పరిశీలించాలి. భిన్న విశ్వాసాలున్న సమాజాన్ని ఒకే మతశాసనానికి లోబరచాలనుకున్నప్పుడు ఎవరి విశ్వాసం పాలిస్తుంది? ఎవరి విశ్వాసం తలవంచాలి? ఈ ప్రశ్నకు సమాధానం చివరకు బలమున్నవారి ఆధిపత్యమే అయితే ప్రజాస్వామ్యానికి మిగిలేదేమిటి?

దీనికంటే తీవ్రమైన ప్రశ్న వర్ణాశ్రమ వ్యవస్థది. సనాతన ధర్మ పునరుద్ధరణ పేరుతో కులాలు ఉండాలని, ఎవరి కులవృత్తిని వారే చేయాలని, పాత సామాజిక క్రమాన్ని కాపాడాలని ప్రతిపాదిస్తే అది స్పష్టమైన తిరోగమనం. మనిషి చదువు, ప్రతిభ, శ్రమ, అభిరుచికి బదులు అతని పుట్టుకనే జీవన శాసనంగా మార్చడమే దాని అర్థం. అటువంటి వ్యవస్థలో సమానత్వం ఉండదు. పై మెట్టులో ఉన్నవాడికి అధికారం, కింది మెట్టులో ఉన్నవాడికి విధేయత మాత్రమే మిగులుతాయి.కులం కొనసాగాలని చెప్పడం అమాయకమైన సాంస్కృతిక అభిప్రాయం కాదు. కులంతో ముడిపడిన అధికారం, అవకాశాలు, అవమానాల గురించి కూడా దానికి సమాధానం చెప్పాలి. కులవృత్తే చేయాలన్న నియమం ఎవరిని బంధిస్తుంది? తరతరాలుగా అవకాశాలు పొందినవారినా, తరతరాలుగా వాటికి దూరమైనవారినా? శ్రమను గౌరవించాలంటే శ్రమజీవికి స్వేచ్ఛ ఇవ్వాలి. అతని పిల్లల భవిష్యత్తును అదే వృత్తికి కట్టివేయడం గౌరవం కాదు---వారసత్వ నిర్బంధం.మానవజాతి నాగరికత వైపు సాగిన ప్రయాణం ఇటువంటి నిర్బంధాలను ప్రశ్నించడంతోనే ముందుకు కదిలింది. ప్రకృతిని అర్థం చేసుకోవడానికి పరిశీలనను ఆశ్రయించింది. వ్యాధులను ఎదుర్కోవడానికి వైద్యశాస్త్రాన్ని అభివృద్ధి చేసింది. విద్య కొందరి సొత్తు కాదని పోరాడింది. స్త్రీకి స్వతంత్ర వ్యక్తిత్వం ఉందని గుర్తించే దిశగా అడుగులు వేసింది. పుట్టుకతో మనుషులు ఎక్కువ తక్కువలుగా మారరని ప్రకటించింది. ఈ పురోగతి సాఫీగా రాలేదు. ప్రశ్నించినవారి కష్టాలు, సంస్కర్తల త్యాగాలు, అణగారిన ప్రజల పోరాటాలు దాని వెనుక ఉన్నాయి.అలాంటి ప్రయాణాన్ని ఇప్పుడు వెనక్కి తిప్పాలనుకోవడమే ప్రమాదం. 'పూర్వకాలం గొప్పది' అనే మాటతో పూర్వకాలంలోని అధికార సంబంధాలను తిరిగి తీసుకురావడానికి వీల్లేదు. బాల్యవివాహాన్ని ఎదిరించి సాధించిన బాలికల హక్కులను సంప్రదాయానికి అప్పగించలేం. వితంతువుకు కొత్త జీవితాన్ని నిరాకరించే ఆచారాన్ని పవిత్రమని అంగీకరించలేం. అస్పృశ్యతను, స్త్రీల అణచివేతను, విద్యపై కుల ఆంక్షలను ఏ ధర్మం పేరుతోనూ సమర్థించలేం. అన్యాయానికి ఎంత పురాతన చరిత్ర ఉన్నా అది అన్యాయమే.ఇక్కడ కొత్త విలువలను ఎత్తిపట్టడమంటే కొత్తగా కనిపించే ప్రతిదానికీ మద్దతు ఇవ్వడం కాదు. సమాన పౌరసత్వం, వ్యక్తి స్వేచ్ఛ, హేతుబద్ధత, శాస్త్రీయ దృక్పథం, స్త్రీపురుష సమానత్వం, కులరహిత మానవ సంబంధాలు---ఇవే ఆధునిక సమాజం సాధించిన ఉన్నత విలువలు. వీటిని బలహీనపరిచి పాత ఆధిపత్యాలను పునరుద్ధరించే భావజాలాన్ని ప్రగతిశీల సమాజం ప్రతిఘటించాలి. పాతదనే కారణంతో ఒక ఆచారానికి ప్రశ్నలకు అతీతమైన స్థానం ఇవ్వకూడదు.మతాన్ని మొత్తంగా గొప్పదని ప్రకటించి, దాని పేరుతో ప్రతిపాదించే సామాజిక నియమాలన్నింటికీ ఆమోదముద్ర వేయలేం. ఏ మతమైనా, ఏ గ్రంథమైనా, ఏ గురువైనా మానవ గౌరవానికి లోబడి ఉండాలి. మతం మనిషిని పరీక్షించే ముందు, మనిషి సంక్షేమం అనే ప్రమాణంతో మతబోధనలను పరీక్షించాలి. మనిషిని అవమానించే నియమాన్ని తిరస్కరించడానికి అతనికి ఏ మతాధికారి అనుమతీ అవసరం లేదు.ఫూలే దంపతుల విద్యా ఉద్యమం, పెరియార్ ఆత్మ గౌరవ పోరాటం, అంబేద్కర్ కుల నిర్మూలన ఆలోచన ఈ సందర్భంలో మరింత అవసరం. వారు ప్రశ్నించిన అసమానతలను తిరిగి ప్రతిష్ఠిస్తూ, వారి చిత్రపటాలకు నివాళులు అర్పించడం కపటత్వం. ఆ మహనీయులు సజీవంగా నిలవాలంటే వారి ఆలోచనలు ప్రజల ఆచరణలో నిలవాలి. కులం పేరుతో ఎదుర య్యే అవమానాన్ని ఎదిరించడంలో, స్త్రీ స్వేచ్ఛను కాపాడడంలో, అణగారినవారి హక్కుల కోసం సంఘటితం కావడంలో వారి పోరాటం కొనసాగాలి.నేడు ఎదురవుతున్న సైద్ధాంతిక సంఘర్షణలో అసలు ప్రశ్న ఇదే: పుట్టుక నిర్ణయించిన స్థానంలో మనిషి ఉండాలా, తన భవిష్యత్తును తానే నిర్మించుకునే స్వేచ్ఛ పొందాలా? ఆచారం ముందు తలవంచాలా, అన్యాయాన్ని ప్రశ్నించాలా? మతాధికారానికి లోబడి జీవించాలా, సమాన పౌరుడిగా నిలవాలా? ఈ ప్రశ్నల వద్ద ఆధునికులు అస్పష్టంగా ఉండకూడదు. మానవ విముక్తికి దారితీసే విలువల పక్షాన స్పష్టంగా నిలబడాలి. ఈ పోరాటం విశ్వాసులపై ద్వేషం కోసం కాదు. విశ్వాసం పేరుతో మనిషిపై పెత్తనం చెలాయించే వ్యవస్థను ఓడించడం కోసం. వ్యక్తికి తన నమ్మకం ఉండవచ్చు; రాజ్యం మాత్రం అందరి సమాన హక్కులను కాపాడాలి. ఏ మతానికన్నా మానవత్వం గొప్పది. ఏ ఆచారానికన్నా మనిషి గౌరవం గొప్పది. ఏ పురాతన శాసనానికన్నా అణచివేత నుంచి విముక్తి పొందే హక్కు గొప్పది.కుల నిచ్చెనను, మూఢవిశ్వాసాన్ని, అణచివేతను పునరుద్ధరించే సనాతనవాదం ఓడిపోవాలి. స్వేచ్ఛా సమానత్వాలను నిలబెట్టే నవీనవాదం బలపడాలి. మానవవాదం గెలవాలి. మనిషిని మనిషిగా చూసే సమాజమే మన లక్ష్యం కావాలి. మానవత్వమే పరమావధిగా నిలవాలి!






డేగల జనార్ధన్,
సూర్యాపేట.

ఆ "పూజ"లో చిత్తశుద్ధి లేదేమో

పూజా ఫలితం ఏమీ కనిపించని స్థితిలో ఈ మాట అనవలసి వస్తున్నది.ఆ మధ్య ఈ సమా జంలోని రెండు ప్రధాన మతాల పెద్దల మధ్య ఒక భేటీ జరిగింది కదా. ఈ రెండు మతాలు ఉత్తర దక్షిణ ధ్రువాల వంటివి. అలాంటి రెండు మతాల ప్రముఖులు సమావేశం కావడం ఆశ్చర్యం కలిగించే పరిణామమే కదా. అందువల్ల ఆ సమావేశం ఒక పూజ లాంటిదే అని భావించాలి.ఆ పూజ నుంచి సమాజం ఫలి తాన్ని ఆశించడం అత్యాశ ఏమీ కాదు కదా. అలాంటి మత ఉద్రిక్త పరిస్థితుల క్రమంలో జరిగిన భేటీపై సమాజానికి ఆశలు ఉండడం కూడా సహజం కదా. అందువల్లనే వీరి భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.వారి భేటీ ఈ సమాజ దుస్థితిని చక్కదిద్దుతుందేమోననే ఆశ ఈ సమాజానికి కొంత ఉండేది.ఈ రెండు మతాల మధ్య ఇక్కడ చాలా కాలంగా ఘర్షణ వాతా వరణం కొనసాగుతున్న సంగతి అందరికీ తెలుసు కదా.ఇటీవలి కాలంలో ఆ వాతావరణం మరింత పెద్దదిగా మారిపోయిన దుస్థితిని మనం చూస్తున్నాం కదా. ఈ స్థితిని చక్కదిద్ది పూర్వపు సామాజిక శాంతిని నెలకొల్పవలసిన అధికార వ్యవస్థ ఆ ఉద్రిక్తతలో మరింత ఆజ్యం పోస్తున్న స్థితిని మనం చూస్తున్నాం.

అయితే... భేటీ తరువాత సామాజిక పరిస్థితుల్లో మార్పు ఏమీ కనిపించ లేదు.ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.అందుకే ఆ భేటీని చిత్తశుద్ధి లేని శివ పూజతో పోల్చేది."చిత్తం శివుడి మీద, భక్తి గుడి వెలుపల వదిలి వేసిన చెప్పుల పైన" అనే ఉపమానంఈ భేటీకి అతికినట్లుగా సరిపోతుంది. అలాంటి ఉత్తుత్తి భేటీయే ఇది.చర్చ, సంభాషణ,భేటీ లాంటి ప్రక్రియలు సామాజిక ఉద్రిక్తతలను సడలించాలి.కానీ జరిగిన ఆ భేటీ అలాంటి సానుకూల ఫలితాలను ఏమీ ఇవ్వ లేదు.వ్యక్తుల మధ్య అయినా సమాజంలోని భిన్న వర్గాల మధ్యనైనా నిజాయితీతో కూడిన ప్రయత్నాలైతే సానుకూల ఫలితాలను తప్పకుండా ఇస్తాయి.వాటి మధ్య ఉండే ఘర్షణ వాతా వరణం కొంత మేరకైనా సడలుతుంది. సమాజ విశాలహితం కోరేవారు అలాంటి ప్రయత్నాలను తప్పకుండా స్వాగతి స్తారు.వర్గాల మధ్య తలెత్తిన విభేదాలు సమస్యలకు పరిష్కారాన్ని,ఓ దిశను చూపుతాయని సామాజిక శాంతిని కోరే వారు తప్పకుండా ఆశ పడతారు.ఈ దేశంలో రెండుప్రధాన మతాలమధ్య చాలా కాలం నుంచీ విభేదాలు ఉన్నాయి.దేశ విభజనగా చెప్పే భారత, పాకిస్థాన్ దేశాల స్వతంత్ర కాలంలో ఘర్షణలు మొదలయ్యాయి.అవి ఈ మధ్య చాలా పెరిగాయి.పెరిగాయి అని చెప్పడం కంటే ఫక్తు మత రాజకీయాలు చేసే శక్తులు పెంచి పోషించాయి అని చెప్పడం సబబుగా ఉంటుంది. ఇలాంటి సామాజిక ఉద్రిక్తతల మధ్య ఈ రెండు మతాల ప్రతినిధులు సమావేశమయ్యారు.వారి మధ్య జరిగిన సంభాషణ ఏమిటనేది వారు వెలుపలికి తెలియ జెప్పలేదు. కానీ భారత సమాజం మాత్రం దాని నుంచి సానుకూల ఫలితాన్ని ఆశించింది.అయితే..... ఆ సమావేశంలో నిజాయితీ లేమి కారణంగా ఫలితం లేకుండా పోయింది.భేటీ తరువాతి పరిణామాలు మరింత ఘర్షణాత్మకంగా మారిపోయాయి.ఆ స్థితి నుంచి ఆ భేటీని పరిశీలిస్తే అది జనాన్ని మాయ చేసి మభ్య పెట్టే సమావేశమేమో అని అనిపిస్తున్నది.సమావేశం వెనక ఏదైనా రహస్య ఎజెండా కూడా ఉందేమోననే అనుమానం సైతం కలుగుతున్నది. ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ అనేటాయన సాధారణమైన వ్యక్తి కాదు.ఆ పదవి ఇప్పుడు ఈ దేశంలో అత్యంత శక్తివంతమైనది.భారత సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న మత ఉద్రిక్తతలను అంతర్జాతీయ సమాజం గమనిస్తున్నది. ఆందోళన ను వ్యక్తం చేస్తున్నది. సగటు మనిషి తన నిత్య జీవితం ఎలాంటి ఒడి దొడుకులూ లేకుండా సాఫీగా సాగితే చాలుననేది అతి సాధారణమైన కోరిక,ఆశ.వీరి భేటీ సత్ఫలితాన్నిచ్చి రెండు సామాజిక వర్గాల మధ్య మునుపటి సామరస్యం నెలకొంటే చాలునని ఈ సమాజం ఆశ పడింది.ప్రస్తుత పరిణామాలను చూస్తుంటే అది అడియాశగా మిగిలి పోయింది.ఆర్ ఎస్ ఎస్ ఎంత శక్తివంతమైనది అంటే ఈ దేశాన్ని ఇప్పుడు ఏలుతున్న రాజకీయ పార్టీకి ఆరెస్సెస్ మాతృ సంస్థ. కేంద్ర ప్రభుత్వ సారథిని సైతం శాసించగల శక్తి ఆ సంస్థకు,ఆ సంస్థ ద్వారా సరసంఘ్ చాలక్ కు ఉన్నాయి.ఈ సంస్థను సంస్థ సారథిని ధిక్కరించగలిగే శక్తి ఇప్పటి ఈ దేశ ఏలిక తో సహా "సంఘ పరివారం"లోని వేలాది అనుబంధ సంస్థల్లో ఒక్క సంస్థకూ లేదు."ఏక్ చాలక్ అనువర్తిత"(ఒకరు ఆదేశిస్తారు ఇతరులు అందరూ ఆ ఆదేశాన్ని మారు మాట్లాడకుండా శిరసావహిస్తారు) అనే మూల సూత్రంపైనే ఆరెస్సెస్ పరివారం వంద యేళ్ళుగా కొనసాగగుతున్నది.ఈ సంగతి కూడా చాలా మందికి తెలిసే ఉంటుంది.అలాంటి శక్తివంతమైన గద్దెకు సారథిగా ఉన్న వ్యక్తి సమాజాన్ని ఇలా మాయ చేయవచ్చునా? "పెద్దమనిషి" చేయవలసిన పనేనా ఇది?ఇది మేరకు న్యాయం? ఏమాత్రం సానుకూల ఫలితాన్ని ఇవ్వని ఈ ఇద్దరి భేటీ ఒక మాయ భేటీ మాత్రమే అవుతుంది కదా.ఈ స్థితిలో చిత్తశుద్ధి లేని శివ పూజ లాంటిదే ఈ భేటీ కూడా అని చెప్పవలసి వస్తున్నది.



గోవర్ధన్ గండె,
9347056621.

అందాల నయగారా.. ప్రపంచానికి నజరానా!

అందాల నయగారా...!
అబ్బురపరిచే జలధారా!
ప్రపంచానికి నువ్వొక నజరానా..
మరచిపోలేము నీ సోయగం
నీ వీక్షణం అపురూపం
ఇది మా జీవితకాలపు అనుభవం!

ఈ అనుభూతిని ఎలా వర్ణించను...ఈ అనుభవాన్ని ఎలా వివరించను? ఈ ఆనందాన్ని ఎలా వ్యక్తీకరించను? ఈ దృశ్యాలను వర్ణించడానికినా అక్షరాలు సరిపోతాయా?నా వాక్యాలు న్యాయం చేస్తాయా? నేను కళ్లారా చూసిన దానిని మీ కళ్లకు కట్టగలనా? ఏమో! ప్రపంచ ప్రఖ్యాత నయగారా జలపాతాన్ని వీక్షిస్తున్న సమయంలో...తర్వాత నా మనసులో తలెత్తిన ప్రశ్నలివి. అమెరికా నుంచి రెండు వారాల పర్యటన కోసం మేము కెనడాకు వచ్చాం. టోరంటో సమీపంలోలోని మిస్సిస్సాగా నుంచి గంటన్నర దూరం ప్రయాణించి కారు దిగి అలా అలా నడచుకుంటే వెళ్తుంటే... చెట్ల కొమ్మల మధ్య నుంచి కనబడే జలధారలు కనువిందు చేశాయి. సమీపిస్తున్న కొద్దీ నయాగారా జలపాతం అందాలను ప్రత్యక్షంగా...దగ్గరి నుంచి చూడబోతున్నామన్నభావన మనసును ఉక్కిరి బిక్కిరి చేసింది. చూస్తామని కలలో కూడా అనుకోని సుందర జలపాతం కళ్ల ముందు కనిపిస్తుంటే మనసు ఆనంద తాండవం చేసింది. చిన్నప్పటి నుంచి వింటున్నపేరు ..పాఠ్య పుస్తకాల్లో చదువుకున్న జలపాతం నయగారా. అటువంటి చోటుకు రాగలిగామన్న సంతృప్తితో అడుగులు వడివడిగా ముందుకు పడ్డాయి. క్వీన్స్ విక్టోరియా పార్క్ ప్రదేశానికి చేరుకోగానే ఒక్కసారిగా కళ్లు విప్పారాయి. ఎదురుగా మూడు జలపాతాలు. ఆకాశం నుంచి ఒక్క సారిగా గుమ్మరించినట్లు నీటి ధారలు కిందికి దుముకుతున్న దృశ్యం కట్టిపడేసింది. పాల నురగల్లాంటి ప్రవాహాలు, కింది నుంచి పైకి ఎగసి పడే చిరుజల్లులు, హోరున శబ్దాలు.. చెప్పలేని అందాలు. శివుని ఝటాజూటం నుంచి జాలువారిన గంగమ్మ సాక్షాత్తూ కైలాసం నుంచి కిందికి దుముకుతున్నట్లు అనిపించింది. ఈ చివరి నుంచి ఆ చివరి వరకు విస్తరించిన ప్రవాహాలు. ఒకవైపు చూస్తే మరొకవైపు అందాలను మిస్సవుతున్నామన్న భావన. పై నుంచి దుమికే జలధారలు, ముఖాలను తడిపే చిరుజల్లులు... ఆ అనుభూతిని మాటల్లో వర్ణించడం కష్టం. అంతా శ్వేతవర్ణం పులుముకున్న వేళ జలధారలను సవాల్ చేస్తున్నట్లు...ఏటికి ఎదురీదుతున్నట్లు కనిపించిన పక్షుల గుంపు కనువిందుచేసింది. అవి ఏదో సందేశం ఇస్తున్నట్లే అనిపించింది. అక్కడక్కడ ఎరుపు రంగు పరచుకున్న బోట్లు నయగారా నుదుట సిందూరంలా కనిపించాయి. వాతావరణం మరీ చల్లగా లేకపోగా సూర్యుడు కూడా దర్శన మివ్వడంతో ఆ కాంతిలో ఇంద్ర ధనుస్సులు ఏర్పడి అందాలను మరింత పెంచాయి. ఏడు రంగుల ఇంద్రచాపాలు సంపూర్ణంగా ఏర్పడిన దృశ్యం చూసి తీరాల్సిందే. నీటి ప్రవాహంలో వాటి ప్రతిబింబాలు కనిపిస్తూ పూర్తి వలయాకారంలో ఇంద్ర చాపాలను చూడటం గొప్ప అనుభూతి. అప్పుడే కనిపించి...మరు క్షణమే మాయమైనప్పుడు కాసింత అసంతృప్తి. వెనువెంటనే మరో చోట అంతకంటే ముదురుగా మరో చాపం. వావ్..అనుకోగానే దానికి పైగా మరొకటి ప్రత్యక్షం. రెండు , మూడు ఇంద్ర చాపాలు పార నురగల్లాంటి నీటిలో ప్రతిబింబిస్తుంటే వాటిని చూడాలా...ఎదురుగా



అబ్బురపరిచే జలధారలను చూడాలా అనే సందిగ్ధత. ఒకటి చూస్తే మరో వైపు దృష్టి తగ్గిపోతుంది. అదే సమయంలో ప్రతి దృశ్యాన్ని సెల్‌ఫోన్‌లో బంధించాలనే ఉబలాటం. ఫొటోలు తీసుకోవాలా? వీడియో తీసుకోవాలా? అనే మీమాంస. మనమే తీస్తే దృశ్యాలను సంపూర్ణంగా ఆస్వాదించలేం. వేరొకరు తీయాల్సిందే.

తుళ్లింతలు...కేరింతలు!

క్వీన్ విక్టోరియా పార్క్ నుంచి జలపాతం అందాలను ఆస్వాదించి బోట్‌లో ఎక్కేందుకు బయల్దేరాం. లైనులో వెళ్లగా ముందుగా అందరికీ ఎర్రని పాలిథీన్ తొడుగులు ఇచ్చారు. వాటిని ధరించి వెళ్లి బోట్ ఎక్కి పై భాగంలోకి వెళ్లాం. బోట్ నెమ్మదిగా కదులుతుంటే చిన్న పిల్లలమే అయిపోయాం. చల్లని గాలి శరీరాన్ని స్పృశిస్తుంటే. ఎగసిపడే తుషారాలు ముఖాలను తడిపేస్తుంటే..కళ్లు విప్పార్చుకుని చూడటం అత్యంత సమీపంలోంచి జలధారల అందాలను చూడటం గొప్ప అనుభవం. జలధారల హోరు మధ్య కేరింతలు, తుళ్లింతలతో సందర్శకులం దరూ ఆనంద తాండవం చేశారంటే అతిశయోక్తి కాదు. పై నుంచి జలధారలు జాలువారుతుండా వేగంగా ప్రవహించే నయగారా నదిలో బోటు ప్రయాణం మరచిపోలేని అనుభూతి. అమెరికన్ ఫాల్స్, బ్రైడల్ వీల్ ఫాల్స్ వైపు నుంచి కెనడా వైపు ఉన్న హార్స్‌షూ ఫాల్స్ వైపు బోట్ ప్రయాణించింది. యూ ఆకారంలో ఉండే హార్స్ షూ ఫాల్స్ దగ్గరికి చేరేసరికి ఉవ్వెత్తున ఎగసి పడే తుంపరల కారణంగా జలధారలకు బదులు పొగమంచులాంటి దృశ్యం కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. చిరుజల్లుల్లో మా తనువులే కాదు...మనసులూ తడిసి ముద్దయ్యాయి. కాస్త దూరంగాబోట్ యూ టర్న్ తీసుకుంటున్నప్పుడు మూడు వైపులా జలపాతాన్ని ఏకకాలంలో చూడగలగడం విశేషం. దాదాపు 25 నిమిషాల పాటు జలపాతాలను కళ్ల నిండుగా వీక్షించి బోటులో వెనక్కి తిరిగినప్పుడు ఎంతో సంతృప్తితో పాటు ఏదో లోటు. తిరిగి ఎప్పుడు ఇక్కడికి వస్తాం? అసలు మళ్లీ రాగలమా లేదా సందేహం. ఇలా ఆలోచిస్తూనే వెళ్లేప్పుడు ఫోటో బూత్‌లో దిగిన ఫొటోను మళ్లీ పైకి వచ్చాం. అలా వస్తూ అమెరికా..కెనడాలను కలిపే వంతెన (రెయిన్‌బో బ్రిడ్జి)నుఅమెరికా వైపు నుంచి నయగారా ఫాల్స్‌ను ఎక్కడి నుంచి చూస్తారో , వారికి ఉన్న మార్గాలు చూసి వారి పరిమితులను అర్థం చేసుకున్నాం. అమెరికా వైపు నుంచీ వివిధ వీక్షణ ప్రదేశాల్లో మూడు జలపాతాల ప్రాంతాన్ని చూడవచ్చు. అయితే కెనడా వైపు నుంచి హార్స్‌షూ ఫాల్స్‌తో పాటు మిగతా జలపాతాలను విశాలమైన దృశ్యంలో వీక్షించడం మరింత అనుకూలం. ఫొటోలు దిగేందుకు కూడా కెనడాయే అనుకూలం. పైకి వచ్చిన తర్వాత తిరిగి ఆ చివరి నుంచి ఈ చివరి వరకు నయగారా అందాలను వీక్షిస్తూ నడిచాం.

మూడు జలపాతాల సమ్మేళనం..

నయగారా జలపాతం దూరంగా చూస్తే రెండు భాగాలుగా కనిపిస్తుంది. కానీ కాస్త పరిశీలనగా చూస్తే మూడు భాగాలుగా ఉంటుంది. వాటిని అవి హార్స్‌షూ ఫాల్స్ , అమెరికన్ ఫాల్స్, బ్రైడల్ వీల్ ఫాల్స్ గా పిలుస్తారు. హార్స్‌షూ ఫాల్స్ ప్రధానంగా కెనడా వైపు ఉంటుంది. అమెరికన్ ఫాల్స్, బ్రైడల్ వీల్ ఫాల్స్ అమెరికా వైపు ఉన్నాయి. బోటు నుంచి పైకి ఎక్కిన తర్వాత ముందుగా కనిపించేది అమెరికన్ ఫాల్స్. ఇవి కాస్త విశాలంగా విస్తరించి ఉంటాయి. తర్వాత కొంత గ్యాప్ తర్వాత బ్రైడల్ వీల్ ఫాల్స్ ఉంటాయి. ఇది ఒకే ధార. దీనిని దాటుకుని ఇంకాస్త ముందుకు వెళ్తే కొంత దూరంలో హార్స్‌షూ ఫాల్స్ కనిపిస్తాయి. యూ ఆకారంలో విస్తరించిన ఈ ప్రాంతం నయగారాకు తలమానికం అని చెప్పొచ్చు. టేబుల్‌రాక్ సమీపంలోకి వెళ్లి పై నుంచి చూస్తే వంపు తిరిగిన ప్రాంతంలో జలధారలు అత్యంత సుందరంగా కనిపిస్తాయి. మూడు వైపుల నుంచి గుమ్మరించినట్లు నీరు కిందికి ప్రవహించడం , కింది నుంచి తుంపరలు ఎగసి పడటం, మధ్యలో ఇంద్ర ధనుస్సులు ఏర్పడటం వావ్...చూసి తీరాల్సిందే. కాస్త దగ్గరి నుంచి చూస్తే నీటి ప్రవాహం ఆకుపచ్చ వర్ణంలో మైమరపిస్తుంది. ఇక్కడ మరో విశేషం ఏమిటంటే....నయగారా నదీ ప్రవాహాన్ని కూడా ఇక్కడి నుంచి వీక్షించవచ్చు. ఎక్కడైనా జల పాతం వద్ద పై నుంచి కిందికి దుమికే జల ధారలే కనిపిస్తాయి. కానీ హార్స్‌షూ ఫాల్స్ వద్ద జల ప్రవాహం ఎక్కడి నుంచి వస్తుంది? జల పాతం పైన భాగంలో ఎలా ఉందో కూడా చూసే అవకాశం ఉంది. అక్కడి దాకా ప్రశాంతంగా ...ప్రవహిస్తూ వచ్చిన నది....ఒక్కసారిగా లోయలోకి జాలువారడం, మూడు వైపుల నుంచీ అ ప్రవాహం కిందికి దుమకడంతో తెల్లని నీటి నురగలు, పొగమంచు, రంగురంగుల హరివిల్లుల మధ్య ఒక సుందర దృశ్యాన్ని ఆవిష్కృతమవుతుంది. వంపు కూడా స్పష్టంగా, అందంగా కనిపిస్తుంది. సాధారణంగా జలపాతాల వద్ద జలధారలకు అతి దగ్గరికి వెళ్లడం, పై నుంచి ప్రవాహాన్ని పరిశీలించగలగడం సాహసంతో కూడుకున్న పని. కానీఎలాంటి శ్రమ లేకుండా జలపాతాన్ని విహంగ వీక్షణం చేయగలగడం ఇక్కడ ప్రత్యేకత. మొత్తమ్మీద నయగారా జలపాతం సందర్శన ఒక జీవితకాలపు అనుభవం. అంతులేని సంతృప్తి కలిగించే అద్భుత అనుభూతి. నయగారా ఒక్క జలపాతం మాత్రమే కాదు; మూడు ప్రధాన జల పాతాలు కలిసిన అద్భుతమైన సహజ దృశ్యం. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఈ నయగారా జలపాతాల చుట్టూ అనేక ఆకర్షణలు ఉన్నాయి. జలపాతం వెనుక భాగంలోని సొరంగాలు, కింద ఉన్న పరిశీలనా వేదికలను చూసే ప్రత్యేక అనుభవం పొందేందుకు జర్నీ బిహైండ్ ది ఫాల్స్, ఎత్తు నుంచి జలపాతాలను చూడాలనుకుంటే స్కైలాన్ టవర్స్ ఉన్నాయి. వీటి ద్వారా వీక్షించడానికి ప్రత్యేకంగా టికెట్లు తీసుకోవలసి ఉంటుంది. క్యాసినోలు, ఇంకా ఎన్నో వ్యాపార, వినోద కేంద్రాలు జలపాతాల చుట్టూ విస్తరించి ఉన్నాయి.



అమెరికా ..కెనడాల మధ్య!..

నయగారా జలపాతం ఉత్తర అమెరికా ఖండంలో, కెనడాలోని అంటారియో ప్రావిన్స్‌కి, అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రానికి మధ్య ఉన్న నయగారా నదిపై ఉంది. ఈ జలపాతం ఎత్తు 57 మీటర్లు . మూడు భాగాలుగా ఉంటుంది. హార్స్‌షూ ఫాల్స్ వెడల్పు 670 మీటర్లు. ప్రధానంగా కెనడా వైపు ఉన్న ఈ జలపాతం మూడు జలపాతాల్లో అతిపెద్దది. మొత్తం నీటి ప్రవాహంలో సుమారు 90 శాతం దీని మీదుగా వెళ్తుంది.గుర్రపు నాడా ఆకారంలో వంపు తిరిగి ఉండటం వల్ల దీనికి హార్స్‌షూ ఫాల్స్ పేరు వచ్చింది. కాగా అమెరికన్ ఫాల్స్ వెడల్పు 260 మీటర్లు. దీని పక్కగా సన్నగా బ్రైడల్ వీల్ ఫాల్స్ ఉంటుంది. పెళ్లికూతురు ముసుగులా పలుచగా కిందకు జారే నీటి ధారల కారణంగా ఈ పేరు వచ్చింది. ఈరీ సరస్సు నుంచి నయగారా నది ద్వారా ఈజలపాతాల నీరు అంటారియో సరస్సు లోకి ప్రవహిస్తుంది. అక్కడి నుంచి సెయింట్ లారెన్స్ నది ద్వారా అట్లాంటిక్ మహాసముద్రం వైపు సాగుతుంది. కెనడా, అమెరికా రెండూ నయగారా నది నీటిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నాయి.

-రావికంటి శ్రీనివాస్,
సీనియర్ జర్నలిస్ట్
హైదరాబాద్,
మొబైల్ : 9908892067